క్లుప్తంగా

నేడు ఆర్మీకి మద్దతుగా ర్యాలీ

బడంగ్‌పేట్: పాకిస్తాన్‌పై యుద్ధం నేపథ్యంలో ఆర్మీ జవాన్లకు మద్దతుగా శనివారం ర్యాలీ నిర్వహించనున్నట్లు మునిసిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీ బడంగ్‌పేట్‌లోని బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహం నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు కొనసాగుతుందని పేర్కొన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. మహేశ్వరం, కందుకూరు మండలాలు, సరూర్‌నగర్, ఆర్కేపురం డివిజన్లు, మీర్‌పేట్, బడంగ్‌పేట్ కార్పొరేషన్లు, జల్‌పల్లి, తుక్కుగూడ మునిసిపాలిటీల నుంచి పార్టీలకు అతీతంగా హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

తుక్కుగూడ: తుక్కుగూడ సబ్ స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం తుక్కుగూడ పురపాలిక పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుందని మహేశ్వరం ఏఈ చక్రపాణి తెలిపారు. తుక్కుగూడ, సర్దార్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు. ఈ అసౌకర్యానికి చింతిస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



రావిర్యాల ఎల్లమ్మ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

తుక్కుగూడ: భారత్ నిర్వహిస్తున్న సిందూర్ ఆపరేషన్‌లో భాగస్వాములవుతున్న సైనికులు క్షేమంగా ఉండాలని ఎల్లమ్మ ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం అన్నారు. పురపాలిక సంఘం పరిధిలోని రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో గురువారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ.. పాకిస్తాన్‌తో జరుగుతున్న యుద్ధంలో మన సైనికులు విజయం సాధించి, క్షేమంగా తిరిగిరావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఏఓ మోహన్‌రావు, జూనియర్ అసిస్టెంట్ మీగడ కాశీనాథ్, పూజారులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.

11నుంచి శ్రీలక్ష్మీచెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలు

కందుకూరు: ముచ్చర్ల అనుబంధ గ్రామం ఊట్లపల్లి శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు బ్రహ్మోత్సవాలు కొనసాగుతాయని ఆలయ నిర్వాహకులు టి.లక్ష్మణ్‌ముదిరాజ్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 11న ఆదివారం మహాగణపతి, విశ్వక్సేన పూజ, హోమాలు, 12న స్వామి, అమ్మవార్ల తిరుకల్యాణోత్సవం, 13న సామూహిక సత్యనారాయణ వ్రతాలు, 14న బోనాలు, రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

పాఠశాల అభివృద్ధికి సహకరించండి

అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి
పాఠశాల విద్యా కమిషనర్‌ను కలిసిన సభ్యులు

మంచాల: ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎస్ఎంసీ సభ్యులు కోరారు. ఈ మేరకు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళితో కలిసి శుక్రవారం పాఠశాల విద్యా కమిషనర్ నరసింహారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆరుట్ల స్కూల్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. ఇప్పటికే రూ.60 లక్షల ఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ నిధులతో పనులు కొనసాగుతున్నాయని స్పష్టంచేశారు. స్కూల్‌కు మరో ఆరు గదులు అవసరమని తెలిపారు. ప్రభుత్వంతోపాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ విద్య అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌గౌడ్, ఆరుట్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ, ఎస్‌డీఎఫ్ సభ్యురాలు పద్మజ షా,ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కంభాలపల్లి భాస్కర్, నూకం రాజుముదిరాజ్, ఎం.డీ. జానీపాషా, చిందం శ్రీశైలం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వం వికసించేలా..



సమ్మర్ కోచింగ్‌లో యోగా సాధన చేస్తున్న చిన్నారులు

- వేసవి సెలవుల్లో ప్రత్యేక శిబిరాలు
- యువత, విద్యార్థులకు యోగాపై ఉచిత శిక్షణ తరగతులు
- కొనసాగుతున్న మొదటి విడత శిబిరం
- ఈనెల 12నుంచి రెండో విడత క్యాంప్

హుడాకాంప్లెక్స్: వేసవి సెలవులు రాగానే ఆటపాటల్లో మునిగిపోయే చిన్నారులు, విద్యార్థులు ప్రస్తుతం ప్రత్యేక శిబిరాలలో కనిపిస్తున్నారు. వారికి నచ్చిన అంశాలను నేర్చుకోవడంతో పాటు ఆరోగ్యం, కళలపై ఆసక్తి చూపుతున్నారు. ఇంట్లో ఉంటే ఎప్పుడూ ఫోన్లతో ఆడటం, టీవీలు, కంప్యూటర్లకు అతుక్కుపోతున్నారనే కారణంతో తల్లిదండ్రులు సైతం వీరిని కొంతసేపైనా అటువైపు మళ్లిస్తున్నారు. దీంతో ఒత్తిడిని జయించి, మానసిక ఏకాగ్రత సాధిస్తారని భావిస్తున్నారు.

పోటీని తట్టుకునేలా..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉనికిని చాటుకోవాలంటే ఏకాగ్రత ఎంతో అవసరం. ఈ నేపథ్యంలోనే పిల్లలు యోగా వైపు ఆసక్తి చూపుతున్నారు. దీనితో పాటు ఆహారంలో సైతం మార్పులను స్వాగతిస్తున్నారు. ఇలాంటి వారి కోసమే సరూర్‌నగర్, కర్మన్‌ఘాట్‌లోని లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లో వ్యక్తిత్వ వికాసం, యోగాపై ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రముఖ యోగా గురువు ఇస్మాయిల్ చెబుతున్నారు. ఈనెల 5న ప్రారంభమైన మొదటి విడత శిబిరం 11న ముగియనుందని తెలిపారు. రెండో శిబిరం ఈనెల 12న మొదలవుతుందన్నారు.

విలువలు పెంచేలా..

వారం రోజుల పాటు కొనసాగే శిక్షణలో వ్యాయామాలు, ప్రాణాయామం, సూర్య నమస్కారాలు, ధ్యానము త్రాటకము తదితర అంశాలపై తర్ఫీదునిస్తారు. పచ్చి కూరగాయలతో చేసిన అమృత ఆహారం, చిరు ధాన్యాలతో చేసిన ఆహారాన్ని అందిస్తారు. యోగాతో పాటు జీవిత పాఠాలు, నైతిక, మానవతా విలువలు, సంస్కృతి, దేశభక్తి తదితర అంశాలపై అవగాహన పెంపొందిస్తారు. ఇందులో భాగంగా తల్లిదండ్రులకు పాదపూజ చేయిస్తారు. నిత్యం సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు తరగతులు కొనసాగుతాయి.

చిరు ధాన్యాలతో ఆహారం..

పూర్వకాలంలో పెద్దలు తీసుకున్న ఆహార పద్ధతులపై అవగాహన కల్పించడంతో పాటు రాగి ముద్ద, రాగి జావా, కొర్రల పొంగలి, సామలతో చేసిన బిస్మిల్లా బాత్, ఊదలతో చేసిన దద్దోజనం తదితర ఆహార పదార్థాలను అందజేయడంతో పాటు వీటిలోని పోషక విలువలను వివరిస్తారు. వీటిని తిన్న మన పూర్వీకులు ఎంత బలిష్టంగా, ఆరోగ్యంగా ఉండేవారో సవివరంగా చెబుతారు. విదేశీ సంస్కృతిలో పడి బేకరీ, ఫాస్ట్‌ఫుడ్‌కు అలవాటు పడుతున్న యువత, విద్యార్థుల్లో మార్పు తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు.

మొబైల్ అడిక్షన్ నుంచి..

కొంతమంది పిల్లల్లో స్క్రీన్ అడిక్షన్ ప్రస్తుతం పెద్ద సమస్యగా మారింది. ఫోన్, టీవీ, కంప్యూటర్, ల్యాప్‌టాప్‌తోనే ఎక్కువ సేపు గడుపుతుంటారు. వీటి నుంచి పిల్లలను ఎలా బయటకు తీసుకురావాలో తెలియక తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటి వారికోసం బౌద్ధ సన్యాసుల నుంచి వచ్చిన యోగ సాధన పద్ధతులను నేర్పిస్తున్నారు.



చిన్నారులకు యోగా శిక్షణ ఇస్తున్న ఇస్మాయిల్ గురూజీ



యోగా శిక్షణలో ఆహారం తింటున్న చిన్నారులు

సద్వినియోగం చేసుకోవాలి

బాల్యంలో వేసిన పునాదులే ప్రతిఒక్కరినీ బతుకంతా నడిపిస్తాయి.. చిన్నతనంలోని ఉత్తమ సంస్కారాలు నేర్పించినట్లయితే వారి జీవితం నందనవనంగా మారుతుంది. మనో నియంత్రణకు యోగా మంచి సాధనం. పిల్లలతో పాటు పెద్దవారు సైతం యోగాను అలవర్చుకోవాలి. దీనిద్వారా మానసిక, శారీరక దృఢత్వం కలుగుతుంది. ఉచితంగా నిర్వహిస్తున్న ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– యోగేశ్వర్, యోగా గురువు

పాఠశాల అభివృద్ధికి సహకరించండి

- అదనపు గదుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయండి
- ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కమిటీ వినతి
- పాఠశాల విద్యా కమిషనర్‌ను కలిసిన సభ్యులు



పాఠశాల విద్యా కమిషనర్ నరసింహారెడ్డిని కలిసిన ఆకునూరి మురళి, ఎస్ఎంసీ సభ్యులు

మంచాల: ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అదనపు గదుల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని ఎస్ఎంసీ సభ్యులు కోరారు. ఈ మేరకు విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళితో కలిసి శుక్రవారం పాఠశాల విద్యా కమిషనర్ నరసింహారెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ఆరుట్ల స్కూల్‌ను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇందుకోసం ప్రభుత్వ సహకారం అవసరమన్నారు. ఇప్పటికే రూ.60 లక్షల ఎన్ఆర్ఈజీఎస్, ఎస్‌డీఎఫ్ నిధులతో పనులు కొనసాగుతున్నాయని స్పష్టంచేశారు. స్కూల్‌కు మరో ఆరు గదులు అవసరమని తెలిపారు. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వచ్చి పాఠశాల అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు. పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ విద్య అందించడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఆరుట్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరిధర్‌గౌడ్, ఆరుట్ల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుప్రియ, ఎస్‌డీఎఫ్ సభ్యురాలు పద్మజ షా, ఆరుట్ల ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు కంభాలపల్లి భాస్కర్, నూకం రాజుముదిరాజ్, ఎం.డీ. జానీపాషా, లాలగారి జంగయ్య, నూకం మల్లేశ్, చిందం శ్రీశైలం, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రమను దోచుకుంటున్న పరిశ్రమలు



సమ్మె పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

సమ్మెను జయప్రదం చేయండి: సీఐటీయూ నాయకులు

షాబాద్: వలస కార్మికుల శ్రమను చందనవెళ్లి పరిశ్రమల యాజమాన్యాలు దోచుకుంటున్నాయని సీఐటీయూ చందనవెళ్లి ఇండస్ట్రీస్ కన్వీనర్ అల్లి దేవేందర్ ఆరోపించారు. శుక్రవారం షాబాద్ మండలం చందనవెళ్లి పారిశ్రామిక ప్రాంతంలో సమ్మె వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల శ్రమను దోచుకుంటున్న పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, 44 కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని కోరారు. కొత్త లేబర్ కోడ్స్ కారణంగా ఎనిమిది గంటల పని విధానం.. 12 గంటలకు పెరిగిందని ఆవేదన వ్యక్తంచేశారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 20న దేశ వ్యాప్త సమ్మెకు అన్ని కేంద్ర కార్మిక సంఘాలు, స్వతంత్ర ఫెడరేషన్లు, బ్యాంకు ఉద్యోగులు పిలుపునిచ్చారని పేర్కొన్నారు. చందనవెళ్లి పారిశ్రామిక ప్రాంతంలో జరిగే సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు దాసుగుప్తా, కుమార్ యాదవ్, ప్రకాశ్, విక్రమ్, మోసం ఖాన్ తదితరులున్నారు.

వీర జవాన్‌కు అశ్రునివాళి

లంబడాల కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న గిరిజన నాయకులు

షాద్‌నగర్: దేశం కోసం ప్రాణాలర్పించిన ఆర్మీ జవాన్ మురళీ నాయక్ త్యాగం వెలకట్టలేనిదని లంబడాల హక్కుల రాష్ట్ర అధ్యక్షుడు రాంబల్ నాయక్ అన్నారు. జవాన్ మృతికి నివాళిగా శుక్రవారం రాత్రి షాద్‌నగర్ పట్టణంలో భారీగా కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయక్ మాట్లాడుతూ.. పాకిస్తాన్ పై జరుగుతున్న పోరాటంలో ఏపీలోని గిరిజన కుటుంబానికి చెందిన మురళీ నాయక్ మృతి ఎంతో బాధాకరమన్నారు. యుద్ధ భూమిలో ఉగ్రవాదులను హత మార్చడంలో మురళీ పోరాటం ఎనలేనిదని కొనియాడారు. ఆయన త్యాగం చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మురళీ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు నాయక్, లక్ష్మణ్ నాయక్, వర్త్య నాయక్, బద్రి నాయక్, అయోధ్య శ్రీనివాస్, చందర్ నాయక్, పరశరాం, అంబదాస్, చందర్ నాయక్, రాజేష్ నాయక్, వినోద్ నాయక్, రమేష్, వెంకట్ నాయక్, లక్ష్మణ్ నాయక్, రాజేందర్, రవీందర్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడొద్దు

షాద్‌నగర్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణ శివారులోని చౌడమ్మ గుట్టలో కిషన్‌నాయక్, లింగం నాయక్, రమేష్ నాయక్ ఆధ్వర్యంలో చౌడమ్మ ఆలయ పునఃనిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన పూజలు చేసి మాట్లాడారు. హిందు ధర్మ పరిరక్షణ కోసం అందరూ కృషి చేయాలని సూచించారు. పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడుతుండంతో దేశ సంస్కృతి, సంప్రదాయాలు కనుమరుగువుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. అలాంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. దేశ భక్తి, జాతీయ భావాలను సమాజంలో వ్యాపింపజేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మోహన్‌సింగ్, ఇస్నాతి శ్రీనివాస్, సుధాకర్ అప్ప, శ్రీను నాయక్, రాజ్‌కుమార్, రవి, లచ్చిరాం, రాజు నాయక్, శ్రీరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వీర జవాన్ మురళీనాయక్‌కు అశ్రు నివాళి

ఎల్‌బీనగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గిరిజన సంఘాల కొవ్వొత్తుల ర్యాలీ



అమర జవాన్ మురళీనాయక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రజలు

నాగోలు: దేశ సరిహద్దు ప్రాంతంలో పాకిస్తాన్ జరిపిన కాల్పులకు భారత సైనికుడు మురళీనాయక్ అమరుడయ్యాడు. శుక్రవారం రాత్రి ఎల్‌బీనగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద గిరిజన సంఘాల ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గిరిజన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొర్ర లక్‌పతి నాయక్ వారు మాట్లాడుతూ... పాకిస్తాన్ యుద్ధానికి కాలు దువ్వుతూ సరిహద్దు ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న భారత సైనికులపై కాల్పులకు దిగుతోందన్నారు. సరిహద్దులో జరిగిన హోరాహోరీ పోరులో వీరోచితంగా పోరాడి మురళీనాయక్ అమరుడయ్యారని అన్నారు. ఈ సందర్భంగా గిరిజన సంఘాల ఆధ్వర్యంలో శ్రద్ధాంజలి ఘటిస్తూ వారి కుటుంబ సభ్యులకు యావత్ భారతీయుల తరపున ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఎల్‌బీనగర్ చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి అశ్రు నివాళి అర్పించారు. భారతదేశంపై అక్కసుతో పాకిస్తాన్ ఉగ్రవాదులను పెంచిపోషిస్తోందని అన్నారు. పాకిస్తాన్‌తో పాటు ఉగ్రవాదులకు భారత సైన్యం సరైన గుణపాఠం చెప్పాలన్నారు. తెలంగాణ గిరిజన సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్పుల శివప్రచండ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు మూడావత్ గోపినాయక్, గిరిజన సంస్కృతి చీఫ్ ఎడిటర్ రమావత్ ధర్మానాయక్, బంజారా బావోజీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జటావత్ లక్ష్మణ్ మహారాజ్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర సునీల్‌నాయక్ పాల్గొన్నారు.

‘సాక్షి’పై కూటమి సర్కార్ కక్షసాధింపు



షాద్‌నగర్: శ్రీనివాస్



కొందుర్గు: జయ

షాద్‌నగర్: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా పని చేస్తున్న పాత్రికేయులపై ఏపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని టీయూడబ్ల్యూజే(ఐజేయూ) మఫిషియల్ రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్ అన్నారు. ‘సాక్షి’ ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంట్లో పోలీసులు సోదాలు చేయడాన్ని ఖండిస్తూ శుక్రవారం ఆయన మాట్లాడారు. అవినీతి అక్రమాలను వెలికి తీయడంతో పాటు ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరించే ప్రక్రియలో భాగస్వామ్యం అవుతున్న పత్రికా రంగంపై దాడి చేయడం దారుణమన్నారు. ఇది ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిందని పేర్కొన్నారు. ప్రశ్నించే గొంతుకలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడటం మంచిదికాదని హితవు పలికారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి

కొందుర్గు: పాత్రికేయులపై దాడి చేసి, పత్రికా స్వేచ్ఛను హరించడం సరికాదని బీసీసేనా జిల్లేడ్ చౌదరిగూడ మండల అధ్యక్షురాలు ప్యాట జయ అన్నారు. ‘సాక్షి’ ఎడిటర్ ధనంజయ రెడ్డి ఇంటిపై ఏపీ పోలీసులు దాడిచేయడాన్ని సోషల్ మీడియా వేదికగా ఆమె ఖండించారు. ఇలాంటి చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య వ్యవస్థను కూని చేయడమేనని పేర్కొన్నారు. ఎవరైనా తప్పుచేస్తే పోలీసులు నిబంధనల ప్రకారం నడుచుకోవాలని, ఇలా ఏకంగా ఇళ్లల్లోకి చొరబడటం ఏమిటని ప్రశ్నించారు. ఎడిటర్‌పై పెట్టిన అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వివరించండి

షాద్‌నగర్‌రూరల్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని బూర్గుల గ్రామంలో బీజేపీ ఆధ్వర్యంలో గావ్‌చలో- బస్తీ చలో కార్యక్రమాన్ని నిర్వహించారు. పార్లమెంట్‌లో బీసీ కులగణనపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. కేంద్రంలో మోదీ సమర్థవంతమైన పాలన అందిస్తున్నారని తెలిపారు. బీసీ కులగణన, దేశ రక్షణలో భాగంగా పాక్ తీవ్రవాదులపై సిందూర్ ఆపరేషన్ వంటి సాహసోపేతమైన నిర్ణయాలు దేశానికి ఎంతో గర్వకారణమని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు సురేష్, కుర్మయ్య, ప్రశాంత్, రఘుగౌడ్, లింగం, కృష్ణ, మధు, మహేశ్, యాదయ్య, శ్రీశైలం, శివ, కరుణాకర్, రమేష్, జంగయ్య, దేవదయాళ్, చంద్రశేఖర్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



పథకాలను వివరిస్తున్న బీజేపీ నాయకులు

జూకల్‌లో ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’

- అనుభవానికి తోడు శాస్త్రవేత్తల సలహాలు పాటించాలి
- సవాళ్లను అధిగమించి అభివృద్ధికి కృషి చేయాలి
- మంచి దిగుబడులు సాధించాలి
- రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ తదితరులు

శంషాబాద్ రూరల్: రైతులు సాగులో తమ అనుభవాలతో పాటు శాస్త్రవేత్తలు, వ్యవసాయధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడులు పొందాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మండల పరిధిలోని జూకల్‌లో శుక్రవారం ‘రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే రైతులను ఉద్దేశించి మాట్లాడారు. నగరానికి సమీపంలో ఉన్నప్పటికీ రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఇంకా చాలా మంది రైతులు వ్యవసాయమే ప్రధాన జీవనాధంగా జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రైతులు కష్ట పడి అధిక దిగుబడులు సాధించి, విలువైన భూములను అమ్ముకోకుండా కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంతో రైతులు సాగుపై మరింత అవగాహన పెంచుకోవాలన్నారు. కొత్త ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు గడిచిందని.. ఇంతలోనే అంతా అయిపోయినట్లు భావించవద్దన్నారు. సవాళ్లను అధిగమించి రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. దేశ రక్షణలో పాల్గొంటున్న సైనికులకు జాతీయ జెండా పట్టుకుని సంఘీభావం ప్రకటించారు. పాల్మాకుల సొసైటీ పరిధిలోని 70 శాతం మంది రైతులకు ఇప్పటి వరకు రుణ మాఫీ జరగలేదని రైతులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు.

ప్రతి గ్రామానికీ నాణ్యమైన విత్తనాలు...

గ్రామాల్లో రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ విశ్వ విద్యాలయం పీఅండ్ఎం సెల్ డైరెక్టర్ డాక్టర్ టి.శశికళ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 12 వేల గ్రామాల్లో ఇద్దరు రైతుల చొప్పున 40 వేల మంది రైతులకు జూన్ 2 నుంచి విత్తనాలు పంపిణీ చేస్తామన్నారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలన్నారు. పంటలకు అవసరం మేరకు రసాయన ఎరువులు వాడాలన్నారు. ఎరువులు, విత్తనాల కొనుగోలు రశీదులను తప్పనిసరిగా తీసుకుని భద్రపర్చాలన్నారు. తక్కువ నీటితో వరి సాగు చేసుకోవచ్చన్నారు. ఆరుతడి వరి సాగుపై దృష్టి పెట్టాలన్నారు. చీడపీడల ఉధృతిని అరికట్టడానికి పంట మార్పిడి చాలా ముఖ్యమన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం చెట్లను పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు.

రైతు సంక్షేమంతోనే సమాజాభివృద్ధి: డీఏఓ

రైతు సంక్షేమంతోనే సమాజాభివృద్ధి సాధ్యమని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. వ్యవసాయంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అధిక దిగుబడులు పొందాలన్నారు. కొత్త వంగడాలు, డిమాండ్‌ను గుర్తించి ఆయా పంటల సాగును చేపట్టాలన్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలకు ఎరువులు వాడుకోవాలన్నారు. రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రీయ ఎరువులను వినియోగించాలన్నారు. కార్యక్రమంలో పాల్మాకుల సొసైటీ చైర్మన్ కె.శ్రవణ్‌కుమార్‌గౌడ్, వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి, విశ్వ విద్యాలయం సి-ఎస్ఏఆర్ఈ డైరెక్టర్ డాక్టర్ కె.పి.వాణి, ఐఎస్‌హెచ్ఎం ప్రిన్సిపల్ సైంటిస్టు అండ్ హెడ్ డాక్టర్ ఎ.మాధవి, ఆగ్రో క్లైమేట రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ సైంటిస్టు అండ్ హెడ్ డాక్టర్ పి.లీలారాణి, ఇంచార్జి ఏడీఏ కవిత, ఏఓ శ్వేత, ఏఈఓలు రాఘవేందర్‌గౌడ్, సురేష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ తన్వీరాజు, మాజీ సర్పంచు నర్సమ్మ, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, రైతులు శంకర్‌రెడ్డి, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.